నేటి నుంచి ఎంజీఐటీలో నిర్వాణ-2025

మణికొండ: గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాల వార్షిక ఫెస్ట్ నిర్వాణ-2025ను బుధవారం నుంచి శుక్రవారం వరకు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ జి. చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం 24గంటల జాతీయ హాకథాన్, గురువారం అకాడమిక్, స్పోర్ట్స్ డే, శుక్రవారం వార్షికోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ముగింపు ఉత్సవాలకు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి శ్రీరాంవెంకటేష్ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నాయని ఆయన వివరించారు.

నేడు వాహనాల వేలం

రాజేంద్రనగర్: శంషాబాద్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న 8 వాహనాలను ఉప్పర్‌పల్లిలోని స్టేషన్ ఆవరణలో బుధవారం వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ దేవేందర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ఈ వేలంను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వేలంలో ఏడు ద్విచక్ర వాహనాలతో పాటు ఒక బోలెరో వాహనం ఉందన్నారు. ఆసక్తి గల వారు ఉప్పర్‌పల్లిలోని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

ముచ్చింతల్‌ను సందర్శించిన రాజనీతిశాస్త్ర విద్యార్థులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని రాజనీతిశాస్త్ర విభాగానికి చెందిన విద్యార్థులు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ డి వీరబాబు ఆధ్వర్యంలో మంగళవారం ముచ్చింతల్ గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో కల్పించిన సౌకర్యాలు, పారిశుధ్యం, వృత్తి, ఆరోగ్యం, వైద్య సేవలు, విద్యుదీకరణ, వ్యవసాయం తదితర వివరాలను విద్యార్థులు సేకరించారు. ప్రభుత్వ పథకాల అమలు, డిజిటల్ అక్షరాస్యత, ప్రజల అభిరుచులు, విద్యార్థుల చదువు, తల్లిదండ్రుల వృత్తులు వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్.వీరబాబు మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధి కోర్సులో ప్రభుత్వం అమలు చేసే కార్యక్రమాలు, 29 అంశాలను పరిశీలించడానికి ఈ క్షేత్ర పర్యటన నిర్వహించినట్లు వివరించారు.

ఆలయాలకు నోటీసులు ఇవ్వడం తగదు: బీజేపీ

రాయదుర్గం: నానక్‌రాంగూడలోని కాళికామాత ఆలయానికి హైడ్రా అధికారులు ఇచ్చిన నోటీసును వెంటనే వెనక్కి తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ డిమాండ్ చేశారు. నానక్‌రాంగూడలో 400 ఏళ్ల చరిత్ర కలిగిన కాళికామాత ఆలయానికి హైడ్రా అధికారులు నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో బీజేపీ నాయకులు ఆలయాన్ని పరిశీలించి అర్చకులు, నిర్వాహకులలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల భూములపై పడడం తగదన్నారు. బీజేపీ అధిష్టానంతో చర్చించి పెద్ద ఎత్తున ఆలయ పరిరక్షణకు ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు దర్శన్‌సింగ్, కైలాస్‌సింగ్, శివసింగ్, కన్నయ్యలాల్, బీజేపీ నాయకులు రాధాకృష్ణయాదవ్, ఎల్లేష్, తిరుపతి, వరలక్ష్మీ, కవిత తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు

యాకుత్‌పురా: రంజాన్ నైట్ బజార్ సందర్భంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నమని మీర్‌చౌక్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ నయిముద్దీన్ తెలిపారు. మంగళవారం రాత్రి ఆయన స్టేషన్ పరిధిలోని దారుషిఫా, సాలార్‌జంగ్ మ్యూజియం, పురానిహవేలి, అలీజాకోట్లా, బీబీ బజార్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రంజాన్ మాసం నేపథ్యంలో సాయంత్రం నుంచి రాత్రి, తెల్లవారుజాము వరకు జరిగే మార్కెట్‌కు సమస్యలు రాకుండా చూస్తున్నమన్నారు. స్టేషన్ పరిధిలోని నిత్యం రద్దీగా ఉండే చార్మినార్ రోడ్డు, బీబీ బజార్ చౌరస్తా, మొఘల్‌పురా వల్లా హోటల్, అలీజా కోట్లా, పంజేషా, చార్‌కమన్, యాకుత్‌పురా, మీరాలంమండి, పురానిహవేలీ, దారుషిఫా, సాలార్‌జంగ్ మ్యూజియం ప్రాంతాల్లో 15 మంది అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రాములోరి వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలకు తరలిరండి

లంగర్‌హౌస్: సంగం రాములోరి వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలకు భక్తులు తరలిరావాలని రాంచంద్రజీ మఠం పీఠాధిపతి 1008 మహంత్ రాహుల్‌దాస్ బాబా అన్నారు. శ్రీరామ నవమిని పురస్కరించుకొని లంగర్‌హౌస్ త్రివేణి సంగం ఒడ్డున వెలసిన చారిత్రాత్మక మఠ ఆలయం జానకీ సమేత వీరవెంకట విజయరాఘవ స్వామి ఆలయంలో ఉగాది నుంచి వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక, వాల్‌పోస్టర్‌ను రాహుల్ దాస్ బాబా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి నిత్య హోమాలు, కైంకర్య సేవలు నిర్వహించనున్నామన్నారు. ప్రతిరోజూ స్వామి వారిని వివిధ రకాల వాహనాలపై లంగర్‌హౌస్ పుర వీధుల్లో ఊరేగించనున్నామన్నారు. ఇందులో భాగంగా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం, శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుల కల్యాణాలు నిర్వహించనున్నామన్నారు. లింగారెడ్డి, అల్వాల రవీందర్ రెడ్డి, వినేష్‌సింగ్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెప్పలేని 'చివరి' కష్టాలు

- పదేళ్లుగా పనులు చేస్తూ ఒకటి మధ్యలో వదిలేశారు
- రెండేళ్లుగా మరొకటి శంకుస్థాపనకే పరిమితం
- గోపన్‌పల్లి, ఖాజాగూడ శ్మశానవాటికల పరిస్థితి

మినీ మహా ప్రస్థానాల అభివృద్ధిని మరిచిన పాలకులు

రాయదుర్గం: దశాబ్దకాలంగా గోపన్‌పల్లి, ఖాజాగూడ శ్మశానవాటికలను మినీ మహా ప్రస్థానాలుగా మార్చాలనే ప్రక్రియ పూర్తిస్థాయిలో అమలుకాలేదు. శ్మశానవాటికలలో మౌలిక వసతుల కల్పనకు గోపన్‌పల్లిలో పదేళ్ల క్రితం, ఖాజాగూడలో రెండేళ్ల క్రితం సంకల్పించారు. కానీ దశాబ్దకాలంగా ఈ రెండింటిలోనూ అభివృద్ధి మాత్రం లేదు. ఇప్పటి వరకు గోపన్‌పల్లిలోని మినీ మహాప్రస్థానం పనులు సాగినా మధ్యలో ఆగిపోయాయి. అదేవిధంగా రెండేళ్లయినా ఇప్పటివరకు ఖాజాగూడలోని మినీ మహాప్రస్థానంలో అసలు పనులు ప్రారంభం కాకపోవడం గమనార్హం.

రెండింటినీ ఆదర్శంగా మార్చాలని సర్వత్రా డిమాండ్

రాయదుర్గం ప్రాంతంలో వైకుంఠ మహాప్రస్థానం తరహాలో మినీ మహాప్రస్థానంలామార్చాలనే సంకల్పంతో రెండింటిని అభివృద్ధి చేయాలని తలపెట్టారు. వాటికి అవసరమైన నిధులు కేటాయించి పనులు మొదలు పెట్టాల్సి ఉండగా ఆ దిశగా పనులు జరగలేదు. ఏళ్లు గడుస్తున్నా పనుల ఊసే లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆధునిక వసతులతో ఈ రెండు శ్మశానవాటికలను మినీ మహాప్రస్థానంలా మార్చాలని జనం కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



ఖాజాగూడలో 2023 మే 19న శంకుస్థాపన చేసిన శిలాఫలకం

ఖాజాగూడలోని శ్మశానవాటికను మినీ మహాప్రస్థానంగా మార్చాలని 2023లో నిర్ణయించారు. 19వ తేదీ 2023 సంవత్సరంలో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. 3 ఎకరాల స్థలంలో రూ.3 కోట్లతో ఈ శ్మశానవాటిక ఆధునికీకరణను తలపెట్టారు. ముఖ్యంగా గ్రీనరీ, ఫుట్‌పాత్, బర్నింగ్ ప్లాట్‌ఫామ్‌లు, బోరు, కుళాయి, స్నానపుగదులు, టాయిలెట్లు నిర్మాణం చేయాలని నిర్ణయించారు. లైటింగ్, ప్రహరీగోడ నిర్మించాలనుకున్నారు.కానీ రెండేళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు ఎలాంటి పనులు చేపట్టలేదు.


గోపన్‌పల్లిలో 2015 అక్టోబర్ 29న శంకుస్థాపన చేసి శిలాఫలకం ఇదే

గోపన్‌పల్లి శ్మశానవాటిక అభివృద్ధికి అక్టోబర్ 29, 2015లో అప్పటి రవాణాశాఖ మంత్రి డాక్టర్ పి మహేందర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. రూ.1.54 కోట్లతో ఈ శ్మశానవాటికను మినీ మహాప్రస్థానంగా చేయాలని తలపెట్టారు.ఆ తర్వాత బర్నింగ్ ప్లాట్‌ఫామ్‌ల నిర్మాణం, బెంచీలు, స్నానపు గదులు నిర్మించారు. మూడు వైపులా గేట్లు ఏర్పాటు చేశారు. కానీ కొన్ని నిర్మాణాలను మధ్యలోనే వదిలేశారు. చెత్తాచెదారం, ముళ్ళచెట్లు, పిచ్చి మొక్క లను కూడా తొలగించలేదు. ఇప్పటికీ అదే పరిస్థితి కనిపిస్తోంది. పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం


కాటేదాన్ చౌరస్తాలో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీఐటీయూ నాయకులు

మైలార్‌దేవ్‌పల్లి: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు కష్టాలు మొదలయ్యాయని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం.చంద్రమోహన్ అన్నారు. మంగళవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కాటేదాన్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన చంద్రమోహన్ మాట్లాడుతూ..ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, భవన నిర్మాణ, మున్సిపాలిటీ, జీహెచ్‌ఎంసీ ఇండస్ట్రియల్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులు, ఆశా వర్కర్లు, గ్రామ పంచాయతీ, ట్రాన్స్‌పోర్ట్స్ ఇలా అనేక రంగాల కార్మికులు ధర్నాలు చేస్తున్నప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ధర్నాల వద్దకు వచ్చి డిమాండ్ల పరిష్కారం చేస్తామని హామీలు సైతం ఇచ్చారన్నారు. గతంలో కార్మికులకు అండగా ఉంటామని నమ్మబలికి ఇప్పుడు చేతులు ఎత్తేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు జాజాల రుద్రకుమార్, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.రామ్మోహన్ రావు, జిల్లా సహాయ కార్యదర్శి స్వప్న, జిల్లా కమిటీ సభ్యులు కురుమయ్య, ఎల్లేష్, పార్వతి, నర్సింహ్మా, రాజేంద్రనగర్ నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు స్వామి, జహంగీర్, చంద్రమౌళి, లక్ష్మయ్య, రమేష్ పాల్గొన్నారు.

'ప్రకాష్‌గౌడ్ ఏ పార్టీలో ఉన్నావో బహిరంగంగా చెప్పాలి'


మాట్లాడుతున్న శ్రీనివాస్ రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఏ పార్టీలో ఉన్నావో బహిరంగంగా ప్రజలకు చెప్పాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం కాటేదాన్ బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..నియోజకవర్గం అభివృద్ధి కోసం అంటూ వచ్చిన ప్రతి రూలింగ్ పార్టీలో వెళ్తున్నావు. గతంలో తెలుగుదేశంలో గెలిచి బీఆర్‌ఎస్‌లోకి వచ్చావు. ఇప్పుడు బీఆర్‌ఎస్‌లో గెలిచి కాంగ్రెస్‌లోకి వెళ్లావని అంటున్నావు, ఇంతకి ఏ పార్టీలో ఉన్నావో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నానన్నారు. నీ అక్రమ ఆస్తులను కాపాడుకోవడం కోసం కాంగ్రెస్ పార్టీలో చేరానని చెప్పావు. వారు నిన్ను రానివ్వడం లేదు. చిల్లర రాజకీయాలు మానుకో అని హెచ్చరిస్తున్నానన్నారు. వచ్చే ఎలాంటి ఎన్నికల్లో అయిన ప్రజలు నీకు సరైన బుద్ధి చెప్పే రోజులు ముందున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు అడికె జనార్దన్, ఎస్సీ మోర్చా చేవెళ్ల కన్వీనర్ జోగి రవి, మురళీధర్ రెడ్డి, రావుల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సైబరాబాద్ పరిధిలో వాహనాల వేలం

6 నెలల్లో వాహన యజమానులు పత్రాలు చూపి తీసుకోవచ్చు

రాయదుర్గం: సైబరాబాద్ పోలీసుల వద్ద వదిలివేయబడిన/క్లెయిమ్ చేయని వివిధ రకాల వాహనాలను వేలం వేసేందుకు ఏర్పాట్లు చేశారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో ఉన్నాయి. ఏవైనా అభ్యంతరాలు, వాహనాలు తీసుకోవాలనే ఆసక్తి ఉంటే సైబరాబాద్ కమిషనరేట్ పోలీస్ కమిషనర్ ముందు దరఖాస్తు దాఖలు చేసి నోటిఫికేషన్ తేదీ నుంచి ఆరునెలల వ్యవధిలోపు వారి వాహనాలను క్లెయిమ్ చేసుకోవచ్చన్నారు. అలా చేయకపోతే వదిలివేయబడిన / క్లెయిమ్ చేయని వాహనాలను బహిరంగ వేలం వేస్తారు. వాహనాల వివరాలు మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో అందుబాటులో ఉన్నాయి. ఈ వాహనాలు ఎంటీఓ-11 రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఎన్ వీరలింగం నియంత్రణలో ఉంటాయి. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 9490617317లో సంప్రదించాలి.

ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

రాజేంద్రనగర్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కె.వై.ప్రణయ్ అన్నారు. రాజేంద్రనగర్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్‌ఎఫ్‌ఐ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కె.వై.ప్రణయ్ హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో గత ఆరేండ్ల నుంచి స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.8,258 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని వెంటనే విడుదల చేయాలన్నారు. రాష్ట్ర అసెంబ్లీలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. రూ.23,108 కోట్లు కేటాయింపు చేసిందని..అభివృద్ధి కోసం కేటాయించిన నిధులు ఏమాత్రం సరిపోవని తెలిపారు. రాష్ట్ర బడ్జెట్‌లో గతం కంటే 0.2 శాతం మాత్రమే పెంచారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విద్యారంగం సమస్యలను పరిష్కరించాలన్నారు.

రాజేంద్రనగర్ మండల కమిటీ..

రాజేంద్రనగర్ మండల అధ్యక్ష, కార్యదర్శులుగా జె.తనిష్క్ యాదవ్, ఇ.శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా డి.సంజయ్, ఆర్.కౌశిక్, జై.కిశోర్, ఎ.సంజయ్, సహాయ కార్యదర్శిగా డి.రాజు, ఆర్.మహేశ్, ఎన్.తులసిప్రియ, జి.కౌశిక్, ఎగ్జిక్యూటీవ్ మెంబర్స్ ఎం.కమలేష్, ఎస్.వంశీ, జె.కార్తీక్, ఎం.అనిత, కుమార్‌తో కమిటీ వేశారు.

'రాజీవ్ యువవికాసం'ను సద్వినియోగం చేసుకోవాలి

గచ్చిబౌలి: రాజీవ్ యువవికాసం పథకాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకానికి ఏప్రిల్ 5వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ పథకంలో అన్ని కులాల వారికి స్వయం ఉపాధి కల్పించేందుకు రూ.4 లక్షల వరకు ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. 60 నుంచి 80 శాతం సబ్సిడీ అందిస్తోందన్నారు. దరఖాస్తునకు ఆధార్‌కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి. పాన్‌కార్డు, పాస్‌పోర్టు ఫోటో, ఫోన్ నెంబర్, బ్యాంకు పాస్‌బుక్ సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఒక రేషన్ కార్డులోని సభ్యులలో ఒకరికి మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గుడిమల్కాపూర్‌లో చలివేంద్రం ప్రారంభం

గోల్కొండ: ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఈ వేసవి కాలంలో ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద దివంగత గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దేవర కరుణాకర్ స్మారక చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని బీజేపీ నాయకుడు దేవర వంశీ అన్నారు. మంగళవారం ఆయన గుడిమల్కాపూర్‌లో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నాలు గు దశాబ్దాలకు పైగా ప్రజా సేవ చేస్తూ నిరుపేదలకు అండగా ఉన్న దేవర కరుణాకర్ సేవా కార్యక్రమాలను మునుముందు కూడా కొనసాగిస్తామన్నారు. ఈ చలివేంద్రాన్ని అశ్విన్ మోదీ, విశాల్ సౌజన్యంతో ఏర్పాటు అయింది. ఈ కార్యక్రమంలో అశోక్‌యాద వ్, గంగాధర్, రాధాకృష్ణ, నామయాదగిరి, సుధాకర్‌యాదవ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డు దరఖాస్తుల పరిశీలన

గౌలిపురా: గౌలిపురా డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కొత్త రేషన్ కార్డుల దరఖాస్తుల పరిశీలనను పౌర సరఫరాల శాఖ సర్కిల్-2 అధికారులు ప్రారంభించారు. ఇందులో భాగంగా బస్తీల్లో ఇంటింటికీ తిరుగుతూ ఈ-సేవాల ద్వారా దరఖాస్తు చేసుకున్న ప్రజల దరఖాస్తులను సివిల్ సప్లాయి ఇన్‌స్పెక్టర్లు సయ్యద్ ఇమ్రోజ్, లోకేశ్ రెడ్డి పరిశీలించారు. అర్హులైన ప్రజలందరూ ఈ-సేవా ద్వారా కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇప్పటి వరకు అందిన దరఖాస్తులను ఎప్పకటిప్పుడు పరిశీలిస్తున్నామన్నారు. ఇంటి వద్దకు వచ్చే అధికారులకు ప్రజలు పూర్తిగా సహకరించాలన్నారు. ఈ రేషన్ కార్డుల దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ కొనసాగుతుందన్నారు.

రంజాన్ కిట్ల పంపిణీ

చార్మినార్: రంజాన్ మాసంలో జకాత్ పేరుతో పేద ప్రజలను ఆదుకోవడం చక్కటి దైవ కార్యమని ఎంబీటీ అధికార ప్రతినిధి అంజాదుల్లా ఖాన్ అన్నారు. యాకుత్‌పురా అసెంబ్లీ నియోజకవర్గంలోని 2 వేల మంది నిరుపేదలకు ఆయన మంగళవారం రంజాన్ రేషన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పేదల సమస్యలను తెలుసుకొని ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. రంజాన్ మాసం ప్రారంభమైనప్పటి నుంచి నియోజకవర్గంలోని పేద ప్రజలకు నిత్యావర వస్తువుల పంపిణీ కొనసాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో రెయిన్ బజార్ డివిజన్ ఎంబీటీ నాయకులు అబ్దుల్ రెహమాన్, ముతాహర్ మెహదీ ఖాన్, అఫ్సాన్ ఉల్లా ఖాన్, సయ్యద్ హాజీ, మహ్మద్ షోయెబ్ పాల్గొన్నారు.

సోదరభావంతో పండగలు జరుపుకోవాలి


పంచవటి కాలనీ ఇఫ్తార్ విందులో కార్తీక్‌రెడ్డి, నరేందర్ ముదిరాజ్

మణికొండ: పండగలను సోదరభావంతో జరుపుకోవాలని బీఆర్‌ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పి.కార్తీక్‌రెడ్డి అన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పంచవటి కాలనీ కమ్యూనిటీహాల్‌లో కాలనీవాసులు ఫాజిల్, అమీర్, మొజాహిద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రంజాన్ ఇఫ్తార్ విందులో ఆయన మాజీ మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..హైదరాబాద్‌లో హిందువులు, ముస్లింలు గంగాజమున తహజీబ్‌లా కలిసిమెలసి ఉంటారన్నారు. రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదని, అందులో నెలపాటు రోజంతా ఉపవాసాలు ఉండటం ఎంతో పుణ్యకార్యక్రమమన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు డి.సీతారాం, కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.ధన్‌రాజ్, ప్రధాన కార్యదర్శి జి.నరేందర్, మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి, నాయకులు ఎ.లక్ష్మణ్ రావు, ఉపేంద్రనాథ్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, లక్ష్మీనారాయణ, బి.శ్రీధర్, మాల్యాద్రినాయుడు, దిలిప్, కిరణ్, షేక్ ఆరీఫ్ మహమ్మద్, సుమనళిని పాల్గొన్నారు.

జాతీయ పోటీల్లో రాణించిన క్రీడాకారులు


ఫైనల్స్‌లో రెండో స్థానంలో నిలిచిన హాసినిరెడ్డి, రాములు

మణికొండ: గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన మూగ జూనియర్ బ్యాడ్మింటెన్ పోటీల్లో మణికొండ క్రీడాకారులు రాణించారు. ఈనెల 20న నుంచి సోమవారం వరకు కొనసాగిన పోటీల్లో వారు రాణించి రన్నరప్‌గా నిలిచారు. మణికొండకు చెందిన కేఎస్‌ఆర్ హాసినీరెడ్డి, బి.రాములు డబుల్స్ పోటీల్లో పాల్గొన్నారు. మొదటి రోజు నుంచి ఉత్కంఠగా కొనసాగిన పోటీల్లో గెలుపొందారని కోచ్ రమేష్ మంగళవారం మణికొండలో తెలిపారు. సోమవారం నిర్వహించిన ఫైనల్స్ పోటీల్లో రన్నరప్‌గా నిలిచారన్నారు. వారిని తోటి క్రీడాకారులు, కోచ్‌లు అభినందించారు. రాబోయే రోజుల్లో జరిగే మరిన్ని పోటీల్లో వీరు పాల్గొని తమ సత్తాను చాటుతారన్నారు.

అంగన్‌వాడీ విద్యార్థులకు స్టేషనరీ సామగ్రి పంపిణీ


విద్యార్థులకు సామగ్రి అందజేస్తున్న దృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శేరిలింగంపల్లి ప్రాజెక్ట్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ సెక్టర్ మార్కండేయనగర్ అంగన్‌వాడీ-2, బాబుల్ రెడ్డినగర్ అంగన్‌వాడీ సెంటర్-2 (ప్రీ స్కూల్)లో మంగళవారం యూనైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ బునియాడ్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్టేషనరీ సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు రత్న, అనిత మాట్లాడుతూ..విద్యార్థుల విద్యాభివృద్ధికి ఇటువంటి సహాయ కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. సమాజంలో ప్రతిఒక్కరూ విద్యార్థుల భవిష్యత్తును మెరుగుపరిచేలా సహాయపడాలని కోరారు. ఈ సందర్భంగా బనియాడ్ సంస్థకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సతీష్‌కుమార్, సంగీత, శోభా తదితరులు పాల్గొన్నారు.

పండగలు శాంతియుతంగా జరుపుకోవాలి



శంషాబాద్: పండగలు శాంతియుతంగా జరుపుకోవాలని శంషాబాద్ అడిషనల్ డీసీపీ రామ్‌కుమార్, శంషాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌రావు సూచించారు. పట్టణంలో డీసీపీ కార్యాలయంలో మంగళవారం ఆర్‌జీఐఏ, శంషాబాద్, కొత్తూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రజలతో శాంతికమిటీ సమావేశాన్ని నిర్వహించారు. పండగ సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లపై మాజీ ప్రజా ప్రతినిధులు, స్థానికులు ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌జీఐఏ సీఐ బాలరాజు, శంషాబాద్ సీఐ నరేందర్‌రెడ్డి మాజీ కౌన్సిలర్ జహంగీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ స్థలంపై వీడిన వివాదం

శంషాబాద్: పంచాయతీ అవసరాలకు స్థలాన్ని అప్పగించి ప్రత్యామ్నాయంగా తీసుకున్న స్థలం సరైందేనని హైకోర్టు తీర్పునిచ్చిందని బాధితులు చింతల రామకృష్ణ, చింతల లక్ష్మణ్ తెలిపారు. కోర్టు తీర్పువచ్చిన తర్వాత కూడా తమను కొందరు వ్యక్తులు బెదిరిస్తున్నారన్నారు. వివరాలు వారి మాటల్లోనే.. శంషాబాద్ పట్టణంలో 2001లో మహిళా మండలి భవనం వెనకాల భోజనశాల కోసం అప్పటి పంచాయతీ పాలకవర్గం మా తల్లి చింతల అన్నపూర్ణకు సంబంధించిన 430 గజాల స్థలాన్ని తీసుకుని పట్టణంలోని బృందావన్ కాలనీలో సర్వే నంబరు 687, 688 ప్రత్యామ్నాయ స్థలాన్ని కేటాయించారు. సంబంధిత స్థలంలో గృహ నిర్మాణానికి పంచాయతీ అనుమతి కూడా జారీ చేశారు. ఇందులో గతంలోనే కొంత స్థలాన్ని తాము విక్రయించగా మిగిలి స్థలమైన ప్లాటు నంబరు 173, 174లో ఉన్న 430 గజాల స్థలం పార్కు స్థలంగా పేర్కొంటు కాలనీ అసోసియేషన్ పలుమార్లు కోర్టును ఆశ్రయించినప్పటికీ తమకే సానుకూలమైన తీర్పువచ్చిందన్నారు. 2014 తర్వాత అసోసియేషన్ ప్రమేయంతో అప్పటి పంచాయతీ పాలకవర్గం సంబంధిత స్థలాన్ని వివాదాస్పదంగా పేర్కొంటు తీర్మానం చేయడంతో మరోసారి హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. పంచాయతీ తమ వద్ద భూమిని తీసుకుని ప్రత్యామ్నాయంగా అందజేయడానికి చేసిన బదలాయింపు డీడ్‌ను సమర్థించి హైకోర్టు తుది తీర్పును అందజేసిందన్నారు. హైకోర్టు తుదితీర్పు ఆధారంగా తాము పనులు చేసుకుంటుండగా కాలనీవాసులు 9 మంది వరకు వచ్చిన గత నాలుగైదు రోజులుగా పనులు చేస్తే బాగుండదని బెదిరిస్తున్నారన్నారు. సంబంధిత వ్యక్తులపై ఆర్‌జీఐఏ పోలీసులకు ఈనెల 19న ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. హైకోర్టు ఉత్తర్వులను ఆర్‌జీఐఏ పోలీసులతో పాటు మున్సిపాలిటీకి అందజేసినట్లు పేర్కొన్నారు.

మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రత్యేక చొరవ



అదనపు తరగతి గదులను ప్రారంభిస్తున్న దృశ్యం

అత్తాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నామని రాజేంద్రనగర్ విద్యాధికారి శంకర్‌రాథోడ్ అన్నారు. అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫ్రాంక్లీన్ టెంపుల్ టన్ వారి సహాయంతో రౌండ్ టేబుల్ ఇండియా చారిటబుల్ ట్రస్ట్ వారితో నూతనంగా నిర్మించిన నాలుగు తరగతి గదులు, మూత్రశాలలను మంగళవారం ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా మండల విద్యాధికారి శంకర్‌రాథోడ్, అత్తాపూర్ కార్పొరేటర్ సంగీతాగౌరీశంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు ఈ పాఠశాలలో నిర్వహించాలని కోరారు. పాఠశాలకు అదనపు తరగతి గదులు, కాంపౌండ్ వాల్ నిర్మాణం అవసరం ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా ఫ్రాంక్లీన్ టెంపుల్ టన్ ప్రతినిధి నాగలక్ష్మి మాట్లాడుతూ..విద్యార్థులు క్రమశిక్షణగా చదువుకొని మంచి ఫలితాలు సాధించినప్పుడే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.శ్రీలత, ప్రతినిధులు గౌరవ్, నాగలక్ష్మి, రౌండ్ టేబుల్ ఇండియా చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు మక్సూద్ అహ్మద్, చైతన్య, హర్షిత్, లోకేష్, సీతారాం, శ్రీనివాస్‌సాగర్, ఉపాధ్యాయులు విజయ, సాయిప్రసాదరావు, రోజారాణి, సుజాత, జ్యోతి, జకీరబేగం, హేమలత, రంగారెడ్డి తదితరులున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9989616273
9010221230